క్లుప్తంగా

దుకాణాలు ఖాళీ చేయాలని నోటీసులు



దుకాణదారులతో మాట్లాడుతున్న డీడీఓ మోహన్‌కుమార్

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం జెడ్పీ హైస్కూల్ ప్రహరీ గోడకు ఆనుకుని దుకాణాలు ఏర్పాటు చేసి నిర్వహిస్తున్న వారికి డీడీఓ మోహన్‌కుమార్ నోటీసులు అందజేశారు. పాఠశాల కమిటీ చైర్మన్ చెంగ్రాయులు అభ్యర్థన మేరకు నోటీసులిచ్చి ఖాళీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దుకాణాలు ఉండడంతో పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా మారి పలు సమస్యలకు కారణమవుతున్నట్లు భావించి ఖాళీ చేయిస్తున్నట్లు డీడీఓ మోహన్ కుమార్ తెలిపారు. దుకాణాలు ఖాళీ చేశాక ఆ పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటుతామని ఆయన చెప్పారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పుత్తూరు: క్యాన్సర్ వ్యాధిపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని టాటా ట్రస్ట్ డాక్టర్ వెంకయ్యబాబు తెలిపారు. గురువారం స్థానిక రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ఆధ్వర్యంలో మహిళా సంఘ సభ్యులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళల్లో గర్భసంచి, రొమ్ము, నోటి క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. ఆకులు, వక్కలు తరచూ తినడం, మద్యపానం, గుట్కాల వంటి అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే దానిని జయించవచ్చునని అన్నారు. 130 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. శిబిరంలో డాక్టర్లు రెడ్డిరాణి, మెహతాజ్, మహేంద్ర, ధన, మాధవి వైద్యసేవలందించారు. రాస్ అధికారులు రవి, ప్రకాష్, ఉష, రమణి పాల్గొన్నారు.

క్రిమేషన్ బర్నర్ పరిశీలన



గ్యాస్ బర్నర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

నగరి: పట్టణానికి చెందిన శ్మశాన వాటికలోని గ్యాస్ క్రిమేషన్ షెడ్డును మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి గురువారం పరిశీలించారు. గత ప్రభుత్వంలో మంత్రి ఆర్కేరోజా రూ.1.20 కోట్ల వ్యయంతో ఈ క్రిమేషన్ షెడ్డును నిర్మించి ఈ ఏడాది మార్చి 11వ తేదీన ప్రారంభించి ట్రయల్ రన్ చేశారు. అనంతరం ఎన్నికలు రావడంతో క్రిమేషన్ షెడ్డుకు మూతవేయడం, ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో ఇప్పటివరకు వినియోగానికి నోచుకోలేదు. ప్రస్తుతం క్రిమేషన్ షెడ్డును పూర్తిస్థాయి వినియోగంలోకి తేవడంలో భాగంగా కమిషనర్ క్రిమేషన్ షెడ్డులోని గ్యాస్ బర్నర్‌లను, యంత్రాలను పరిశీలించారు. త్వరలో వినియోగంలోకి తెస్తామన్నారు. ఆయన వెంట డీఈ నరేష్, ఏఈ రమేష్ పాల్గొన్నారు.

క్వారీ వద్దు... మా భూమే ముద్దు



పాతార్కాడులో నిర్వహించిన గ్రామసభ

విజయపురం: మైనింగ్ మాఫియాకు సిరులు కురిపించే క్వారీ మాకొద్దంటూ పాతార్కాడు గ్రామస్తులు నగరి ఆర్డీఓ వెంకటరెడ్డికి తెలిపారు. గురువారం పాతార్కాడు గ్రామ పరిసరాల్లో ఏర్పాటు చేయనున్న మైనింగ్ క్వారీపై ఆర్డీఓ గ్రామసభ నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా గ్రామసభలో పాల్గొన్న ప్రజలు తమ గ్రామంలో ఎలాంటి క్వారీలు నిర్వహించడానికి అనుమతి లేదన్నారు. 100 ఏళ్లుగా పశుమేత కోసం ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు మైనింగ్ మాఫియా జేబులు నింపుకోవడం కోసం నాశనం చేశారని, మళ్లీ క్వారీ పేరుతో భూమిని తవ్వేయడం సరికాదన్నారు. ఇప్పటికే మండలంలో కొండలు, గుట్టలు కనుమరుగయ్యాయని గుర్తు చేశారు. దీనిపై ప్రజాభిప్రాయం సేకరించిన ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తానని ఆయన అన్నారు.

సారా విక్రేత అరెస్ట్

నగరి: మండలంలోని నాగరాజకుప్పం రోడ్డులో జగనన్న కాలనీ గుట్ట వెనుక సారా విక్రయిస్తున్న శ్రీనివాసులు అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేయడంతో పాటు అతని వద్ద నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కూతుర్ని డాక్టర్‌గా చూడాలని ఆశపడ్డా



నా కుమార్తెను డాక్టర్‌గా చూడాలని ఆశపడ్డా. అందుకే బైపీసీ చదివించా. నీట్ కోసం శిక్షణ కూడా తీసుకుంటోంది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేస్తోంది. దీంతో నా బిడ్డ డాక్టర్ కావాలన్న కల సాకారం అవుతుందా అని భయంగా ఉంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేస్తే మాలాంటి వారు డబ్బులిచ్చి చదవుకోవడం కష్టమే. మాలాంటి పేదవారు తమ పిల్లలను డాక్టర్ చదివించుకోవడం కలగానే మిగిలిపోతుంది. ప్రభుత్వం నిర్ణయం మార్చుకోవాలి

స్టెల్లాదేవి, విజయపురం.



ప్రభుత్వం పునరాలోచించాలి..



డాక్టర్ చదవాలనే ఆశతో ఉన్న విద్యార్థులకు కూటమి ప్రభుత్వం మొండి చేయి చూపడం తగదు. మా అమ్మాయి ఎంబీబీఎస్ సీటు సాధించి డాక్టర్ కావాలని కలలు కంటోంది. అయితే చంద్రబాబు ప్రభుత్వం గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తోంది. గత ప్రభుత్వం మంజూరు చేసిన వైద్య కళాశాలలకు కేంద్రం అనుమతులివ్వకుండా మోకాలొడ్డింది. దీని వల్ల వేలాది మంది పేద విద్యార్థులు డాక్టర్ చదువుకు దూరమవుతారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునరాలోచించాలి.

భాస్కర్‌రెడ్డి, కలియంబాకం.

వైద్యం.. అంతంతమాత్రం

ప్రైమరీ హెల్త్ సెంటర్లు	-	7
వైద్యుల సంఖ్య	-	14
సగటున విచ్చేసే రోగులు	-	600
ఇన్ పేషెంట్లు	-	30

- పీహెచ్‌సీలలో కొరవడిన వైద్యసేవలు
- జీఓ 85 రద్దు చేయాలంటూ వైద్యుల సమ్మెబాట
- కాంట్రాక్టు వైద్యులు, స్టాఫ్ నర్సులతోనే వైద్యం



బుగ్గ అగ్రహారం పీహెచ్‌సీలో వైద్యసేవలు అందిస్తున్న కాంట్రాక్టు వైద్యులు



విజయపురం ఆస్పత్రి వద్ద చెట్టు కింద పడుకొని ఉన్న సుబ్రమణ్యం

నగరి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు అంతంతమాత్రంగా అందుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణమే జీఓ నెంబరు 85 తీసుకురావడం పీహెచ్‌సీలలో పనిచేసే ఎంబీబీఎస్ డాక్టర్లకు పీజీ సీట్లో 30 శాతం ఉన్న కోటాను 15 శాతానికి కుదించారు. దీంతో వారు ఆగ్రహానికి లోనయ్యారు. ఇదికాక నాలుగు కోర్సులు మాత్రమే 15 శాతం కోటాలో ఉంటాయి. దీంతో తమకు వ్యతిరేకంగా ఉన్న జీఓ నంబర్ 85ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులంతా వారం రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు ఉంది తప్ప ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పీహెచ్‌సీ వైద్యుల సంఘం వారం రోజులకు ముందే జీఓ 85కు వ్యతిరేకంగా ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు విధులకు ఆటంకం లేకుండా ఆందోళన చేస్తామని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. వారం రోజుల నుంచి విధులకు ఆటంకం లేకుండా, రోగులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా నిరసన వ్యక్తం చేశారు. ఒక రోజు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన, రెండు రోజులు సేవలలో అంతరాయం లేకుండా నిరసన, ఒక రోజు అత్యవసర సేవలకు మాత్రమే పరిమితమై ఓపీలు బంద్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఇలా ఎన్నో మార్గాల్లో నిరసన తెలిపినా రాష్ట్ర ప్రభుత్వం జీఓపై వెనక్కి తగ్గకపోవడంతో ఆందోళన ఉధృతం చేశారు. పీహెచ్‌సీలలో తమ సేవలను ఆపివేసి విజయవాడకు తరలివెళ్లారు. దీంతో పీహెచ్‌సీలకు వచ్చిన రోగులకు కొన్ని చోట్ల కాంట్రాక్టు వైద్యులు సేవలు అందిస్తున్నారు. కొన్ని చోట్ల స్టాఫ్ నర్సులే చూసి పీహెచ్‌సీ వైద్యుల సలహా మేరకు మందులు ఇస్తున్నారు. అత్యవసరమైతే సమీప సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రులకు తరలిస్తున్నారు. సీజనల్ జ్వరాలు, ఇతర వ్యాధుల కోసం వచ్చే రోగులు వెనుదిరుగుతున్నారు. కొందరు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లిపోతున్నారు. అక్కడ డబ్బులు వదిలించుకుంటున్నారు.

జ్వరంతో రెండు రోజులుగా వస్తున్నా...

ఈయన పేరు సుబ్రమణ్యం విజయపురం మండలం పన్నూరు గ్రామం తీవ్ర జ్వరంతో రెండు రోజులుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారు. వైద్యులు నిరసనలో భాగంగా విజయవాడకు వెళ్లిపోవడంతో స్థానికంగా ఉన్న వైద్యసిబ్బంది సేవలు అందిస్తున్నారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో నడవలేక ఆయాసంతో ఆస్పత్రి బయట చెట్టు కిందే పడుకుని ఉన్నాడు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

విజయపురం: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. 'సమయపాలన పాటించరు..అధికారులు పట్టించుకోరు' అనే శీర్షికన గురువారం సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీడీఓ కోసలనగరం సచివాలయాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలని సూచించారు. పనిపై బయటకు వెళ్లేవారు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈఓపీఆర్డీ సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

శ్మశాన స్థలం కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

పుత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని చెర్లోపల్లి ఆదిఆంధ్రవాడకు చెందిన శాంతినగర్ శ్మశాన స్థలాన్ని కబ్జా చేస్తున్నారని, సదరు స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ గ్రామస్తులు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా కార్యదర్శి మునివేలు, సీనియర్ నాయకులు శివయ్య ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో గ్రామస్తులు పాల్గొన్నారు. డప్పు కళాకారుల సంఘ జిల్లా కార్యదర్శి కె.మురగారెడ్డి మాట్లాడుతూ కొందరు శ్మశాన స్థలంలోనే రోడ్డు వేసి తమ రియల్‌ఎస్టేట్ వ్యాపారాలు కొనసాగిస్తున్నారని ఆరోపించా రు. అక్రమ రోడ్డు నిర్మాణాన్ని తొలగించి సదరు శ్మశాన స్థలాన్ని రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈమేరకు తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. దాము, గోవిందయ్య, వినోద్‌కుమార్, మస్తాన్, నాగయ్య, మాతయ్య, వెంకటేష్, నాగభూషణం, చంటి, హరి, చిరంజీవి, సుబ్రమణ్యం, రవి, మునిరాజు పాల్గొన్నారు.

ఆయన మృతి తీరని లోటు



కృష్ణమూర్తి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దూది కృష్ణమూర్తి మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి సంతాపం వ్యక్తం చేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణమూర్తి మరణించారు. ఇది తెలుసుకున్న నారాయణస్వామి పెనుమూరు మండలం గోపాలపురం గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఏఎంసీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు సైతం నివాళులర్పించారు.

వరద బాధితులకు విరాళం



నగరి: విరాళాలు సేకరిస్తున్న ఉపాధ్యాయులు



కార్వేటినగరం: విరాళాలు సేకరిస్తున్న విద్యార్థులు

నగరి: మండలంలోని ముడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు కలసి విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.10,500 విరాళాలు సేకరించి సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఉపాధ్యాయులు, విద్యార్థులు విరాళాలు సేకరించగా స్థానికులు స్వచ్ఛందంగా విరాళాలు అందించినట్లు హెచ్ఎం పి.మురళీకృష్ణ తెలిపారు.

కార్వేటినగరం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కార్వేటినగరంలో విరాళాలు సేకరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి మాట్లాడుతూ, నిరాశ్రయులను ఆదుకునేందుకు తమ వంతుగా విద్యార్థులు నగరంలో తిరిగి రూ.5,116ను సేకరించారని, ఈ సొమ్మును ముఖ్యమంత్రి సహాయ నిధికి జమ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బాలసుబ్రమణ్యం ఆచారి, అధ్యాపకులు, సీఎం లత, జోగిప్రసాద్, భార్గవి పాల్గొన్నారు.

రైతులకు ఉలవల పంపిణీ

వెదురుకుప్పం: రైతులకు ఉలవలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారిణి వనిత తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ, మండలంలోని 12 రైతు సేవా కేంద్రాల్లో ఉలవలు అందుబాటులో ఉంచామని, ఆసక్తి గల రైతులకు పట్టాదారు పాసుపుస్తకం, ఆధా ర్‌కార్డు తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకుని ఉలవలు పొందవచ్చన్నారు. 10 కేజీల ఉలవలు రూ.175లుగా నిర్ణయించినట్లు తెలియజేశారు. అలాగే మండలంలోని రైతులు సాగు చేసిన పంటలను ఈ నెల 23వ తేదీలోపు ఈ-క్రాప్ చేసుకోవాలని కోరారు.

జ్వర పీడితులకు చికిత్స



వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

వెదురుకుప్పం: మండలంలోని చవనపల్లెలో జ్వర పీడితులకు ఆరోగ్య సిబ్బంది చికిత్స చేశారు. గ్రామంలో జ్వరాల బారిన పడి అవస్థలు పడుతున్న నేపథ్యంలో గురువారం వైద్య సిబ్బంది గ్రామాన్ని సందర్శించారు. రోగులకు రక్త, వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని సూచించారు. వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరాలపై ఇంటింటి సర్వే చేస్తున్నట్లు చెప్పారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

పాలసముద్రం : మండలంలోని సింహరాజుపురంలో మరమ్మతుకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేశారు. 'ట్రాన్స్‌ఫార్మర్ కోసం రైతు నిరసన' శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనంపై ట్రాన్స్‌కో ఏఈ ఏఈ వరదరాజు స్పందించారు. తన సిబ్బందితో రైతు జగన్నాథరెడ్డి పొలానికి వెళ్లారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను కొత్తది ఏర్పాటు చేయడంతో కరెంటు కష్టాలు తొలగిపోయాయి. బోరు మోటార్ ఆన్ చేసి వరినారుకు నీరు పారించాడు.

వ్యసనాలకు బానిస కావొద్దు



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ

నగరి: విద్యార్థులు వ్యసనాలకు బానిసలు కాకూడదని విద్యార్థి దశనుంచే ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకొని సాధించేందుకు కృషిచేయాలని సీఐ మహేశ్వర్ అన్నారు. శుక్రవారం శ్రీసూర్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆయన సైబర్ క్రైమ్, మహిళా రక్షణ, డ్రగ్స్ అడిక్షన్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ విక్రేతలను గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు.

4వ విడత కౌన్సెలింగ్ సద్వినియోగం చేసుకోండి

కార్వేటినగరం: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో నిర్వహించే 4వ విడత కౌన్సెలింగ్‌ను అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపల్ గణేష్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఐటీఐ కాలేజీలో ఖాళీగా ఉన్న కోర్సులకు 4వ విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తులను కళాశాలలో అందజేయాలన్నారు. తదుపరి 28వ తేదీ కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ప్రభుత్వ హాజరు కావాలని కోరారు. అలాగే మహిళలకు టైలరింగ్ ట్రేడ్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నామని, ఇతర వివరాలకు 9160012999 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

మత్తుకు బానిసలు కావొద్దు



మాట్లాడుతున్న ఎస్ఐ రాజ్‌కుమార్

కార్వేటినగరం: మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమపై ఆధారపడిన కుటుంబాలకు అండగా నిలబడాలని ఎస్ఐ రాజ్‌కుమార్ హితవు పలికారు. మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై గురువారం రాత్రి మండలంలోని గోపిశెట్టిపల్లె దళితవాడలో గ్రామస్తులకు ఎస్ఐ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సారా, గుట్కా, గంజాయి వంటి వాటికి యువత దూరంగా ఉండాలని, వాటికి బానిసలై జీవితాల్ని నాశనం చేసుకోరాదన్నారు. వాటి వల్ల కలిగే అనర్థాలను, కుటుంబాలు రోడ్డున పరిస్థితి..గురించి వివరించారు. గ్రామాల్లో మత్తు పదార్థాలు అమ్మకాలు జరగకుండా యువతతో పాటు మహిళలు చైతన్యవంతులై పోలీసులకు సహకరించాలని కోరారు. సారా తయారీ, అమ్మకాలు, బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఏఎస్ఐ మునికృష్ణ, స్థానిక ఎంపీటీసీ మురగయ్య, మాజీ సర్పంచ్ ఆంకయ్య, పోలీసులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



మాట్లాడుతున్న ఆచార్య అజిత్‌కుమార్

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ జెడ్పీ హైస్కూల్లో గురువారం ఎంఈఓ రాజేంద్రప్రసాద్, ఎంఈఓ-2 గిరిజ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మోటివేషనల్ స్పీకర్ ఆచార్య అజిత్ కుమార్ మాట్లాడారు. విద్యార్థులు లక్ష్య సాధనకు పట్టుదలతో కృషిచేయాలని, మాజీ జెడ్పీటీసీ చిట్టిబాబునాయుడు మాట్లాడుతూ, టీచర్లు చెప్పిన పాఠాలను విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చన్నారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం రఘు, టీచర్ రమేష్, గోవర్ధన్, ఏలుమలై, కోదండయ్య, రిటైర్డ్ ఎంఈఓ శాంతకుమారి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్

నగరి: పరిశుభ్రతతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం స్వచ్ఛతా హీ సేవా-2024 కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధి పుదుపేట బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లిన ఆయన విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యకర జీవనాన్ని సాగించవచ్చన్నారు. పారిశుధ్య నిర్వహణలో ప్రతిఒక్కరూ సహకరించాలని, వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. నగరంలోని అన్ని ప్రార్థనా స్థలాలు, ఆలయాల వద్ద ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు చేపట్టామన్నారు. మున్సిపల్ ఇంజినీర్ కె.రమేష్, ఇన్‌చార్జ్ శానిటరి ఇన్‌స్పెక్టర్ కెజీ.పురుషోత్తం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం : పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే అందరూ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎంపీడీఓ మురళీమోహన్ అన్నారు. గురువారం స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ తమ నివాస ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవనేది గుర్తెరగాలన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామా పంచాయతీల్లో దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులతో స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేయించారు. డీటీ లోకనాథపిళ్లై ఏఓ కృష్ణయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మూలం పరిశుభ్రత

పుత్తూరు: ఆరోగ్యానికి మూలం పరిశుభ్రతని ఈ విషయంలో ఎవరూ అశ్రద్ధ వహించరాదని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వి.కుమార్ కోరారు. గురువారం కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

మున్సిపల్ ఆధ్వర్యంలో: పట్టణంలోని వ్యాపారస్తులందరూ పరిశుభ్రతను పాటించాలని కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి కోరారు. స్థానిక మెయిన్ స్కూల్ నందు విద్యార్థులతో, పట్టణంలోని వ్యాపారులతో ప్రతిజ్ఞ చేయించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



పాలిటెక్నికల్ కళాశాల విద్యార్థుల ప్రతిజ్ఞ